# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-08-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వికసిత్ భారత్ దృక్పథానికి దేశ న్యాయవ్యవస్థ బలమైన మూలస్తంభంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**

2. **బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారిన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి.**

3. **రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు.**

4. **ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి. శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు.**

5. **వినాయకచవితి గణేష్ మండపాల అనుమతుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.**

==========================

వికసిత్ భారత్ దృక్పథానికి దేశ న్యాయవ్యవస్థ బలమైన మూలస్తంభంగా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ జాతీయ సదస్సును ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ, నూతన నేర చట్టాలతో భారత న్యాయ వ్యవస్థ బలోపేతమైందని తెలిపారు. కొత్త చట్టాలు దేశంలో వలస చట్టాల శకానికి ముగింపు పలికాయని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (37 సెకన్లు)

ఇలా ఉండగా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 3-వందే భారత్ రైళ్ళను దృశ్యమాధ్యమం విధానం ద్వారా ప్రారంభించారు.

--------------------------

ఎన్.టి.ఆర్. జిల్లా ఎ. కొండూరు మండలం కృష్ణారావుపాలెం – కేశ్య తండా మధ్య వాగుకు వరద ఉధృతి పెరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విజయవాడ నగరంలోని మొగల్రాజపురం వద్ద కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. విజయవాడ తూర్పు

నియోజకవర్గ శాసన సభ్యులు గద్దె రామ్మోహన్, సంబంధిత అధికారులు ఆ ప్రాంతానికి వెళ్లి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

విజయవాడలో కురుస్తున్న భారీ వర్షాలపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి .నారాయణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.మరొక వైపు ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో విజయవాడ ప్రకాశం బ్యారేజ్ వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రకాశం బ్యారేజ్ లోని మొత్తం 70 గేట్లను ఎత్తి 3 లక్షల 32 వేలకు పైగా క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

---------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక ప్రాంతాలలో గత రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజా జీవనం స్తంభించింది. నగరాలు, పట్టణాలలో రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయ్యాయి. అనేక ప్రాంతాలలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుండపోతగా కురుస్తున్న వర్షం కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోని పాఠశాలలకు ఆయా జిల్లాల పాలనా యంత్రాంగాలు ఈ రోజు సెలవు ప్రకటించాయి. రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

---------------------------

రాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సూచనలు చేయాలని, అవసరమైన సహాయక చర్యలకు ప్రభుత్వ సిబ్బంది సిద్ధంగా ఉండాలని చెప్పారు. మ్యాన్‌హోల్, కరెంట్ తీగలు తెగిపడే ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ఉధృతి కొనసాగుతున్న వాగులు, వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ……

…..వాయిస్….45 సెకన్లు…

---------------------------

రాష్ట్రంలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసుకునే గణేష్ మండపాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుమతుల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం వేదికగా మంత్రి స్పందిస్తూ, చవితి సందర్భంగా ఏర్పాటు చేసుకునే గణేష్ మండపాల అనుమతుల కోసం స్త్రుఖఅవంప్త్రబ్యిఖజ.అవ్ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించామన్నారు. ఈ వెబ్ సైట్ ద్వారా మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులన్నీ ఏక గవాక్ష విధానంలో ఇచ్చేలా ఏర్పాట్లు చేశామని, రాష్ట్ర వ్యాప్తంగా గణేష్ ఉత్సవాల నిర్వాహకులు ఈ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలి అని మంత్రి సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి జన్ మన్ కార్యక్రమం కింద మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని హద్దుబంగి పంచాయతీ పరిధి పనసగూడ గ్రామంలో నిర్వహించిన పి.ఎం జన్ మన్ గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఎం జన్‌మాన్ ద్వారా గిరిజనుల జీవన స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. సవర, గదభ తెగల గిరిజనులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని జీవన ప్రమాణాలు పెంపొందిచుకోవాలన్నారు. గిరిజనులు పండించే పసుపు, చిరుదాన్యాల పంటలను గ్రామ సమైక్య వందన్ వికాస కేంద్రాల ద్వారా విక్రయించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డి. శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో మంత్రి ఈ రోజు లబ్దిదారులకు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్దిక లోటు ఉన్నప్పటికీ తాము ఇచ్చిన హామీకి కట్టుబడి పింఛన్లను పెంచి అందిస్తున్నామన్నారు. అలాగే జిల్లాకి ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం ప్రాంతాన్ని జిల్లాగా చేస్తామని, వెలుగొండ ప్రాజెక్ట్ ను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు అందించే సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ ఈ రోజు ప్రారంభమైంది. అన్ని జిల్లాల్లో లబ్ధిదారులకు ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల నగదును గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఇంటివద్దకే పంపిణీ చేస్తున్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 65లక్షల మందికి 2 వేల 730 కోట్ల రూపాయల మొత్తాన్ని సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి అందింస్తున్నారు.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, విజయనగరం జిల్లాలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పింఛన్‌లను పంపిణీ చేశారు. కాగా.. భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో ఒకటి, రెండు రోజుల్లో పింఛన్‌ను పంపిణీ చేయవచ్చుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.

---------------------------

మాదకద్రవ్యాలపై యువత అవగాహన కలిగి ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సూచించారు. ఈరోజు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి టౌన్ క్లబ్ వరకు నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ ప్రారంభించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేస్తూ కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల అనేక దుష్పరిణామాలు ఎదురవుతాయన్నారు.

---------------------------

రాష్ట్రంలోని సముద్రతీర ఖనిజ వనరులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని

గనులశాఖ కార్యాలయంలో మంత్రి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ కల్పన, రాష్ట్ర రాబడి పెంచడంలో గనుల శాఖది కీలక పాత్ర అని పేర్కొన్నారు. సౌర ఫలకాలకు ఉపయోగించే కీలకమైన క్వార్ట్జ్ రాష్ట్రంలో అందుబాటులో ఉందని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైనసిలికా శాండ్ కోసం త్వరలో మెరుగైన విధానం తీసుకురానున్నామని మంత్రి వెల్లడించారు.

---------------------------

ఆలయాల ఖ్యాతి మరింత ఇనుమడింపజేసేలా వంశపారంపర్య ధర్మకర్తలు పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. రాష్ట్ర సచివాలయంలో నిన్న మంత్రి వివిధ ఆలయాల వంశపారంపర్య ధర్మకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆలయాల్లో వైదిక సంప్రదాయాలు పాటించడం, ఆధ్యాత్మికత పెంపొందించడం, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందుకు ధర్మకర్తలు సహకారం అందించాలని కోరారు. భక్తులకు తొలి ప్రాధాన్యమిస్తూ ఆలయాల నిర్వహణ కొనసాగించాలని మంత్రి సూచించారు.

======================